క్లుప్తంగా

విద్యారంగంలో ఆదర్శంగా ఏపీ



సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

కర్నూలు (టౌన్): విద్యారంగం బలోపేతంలో ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గార్గేయపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'జగనన్న అమ్మ ఒడి' పథకం ద్వారా లబ్ధిపొందిన విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలు వారు పిల్లలను చదివించుకునేందుకు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా నాలుగో ఏడాది అమ్మ ఒడి పథకం ద్వారా రూ.6,393 కోట్లను తల్లుల ఖాతాల్లో జమ చేశారన్నారు. విద్యార్థులు సీఎం జగనన్నకు ధన్యవాదాలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించడమే గాకుండా జగనన్న అమ్మ ఒడి అనే ఆకారంలో కూర్చుని స్ఫూర్తి చాటారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సర్పంచ్ యేసేపు, ఎంపీటీసీ సురేష్, హెచ్‌ఎం వెంకటరాముడు, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన సేవలందించాలి

కర్నూలు(హాస్పిటల్): ఆశాలు తమ పరిధిలోని గర్భిణులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా మాస్ మీడియా అధికారిణి ప్రమీలాదేవి చెప్పారు. మహిళా ప్రాంగణంలో జరుగుతున్న ఆశా కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మాతృ సంరక్షణలో భాగంగా గర్భిణుల నమోదు ప్రాముఖ్యత, గర్భకాలంలో చేయాల్సిన పరీక్షలు, అందించాల్సిన సేవల గురించి విపులంగా వివరించారు. మాతృ మరణాలు, వాటి నివారణ చర్యలు, ఆశా కార్యకర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఆశా కార్యకర్తల ద్వారా ప్రజలకు అందించే ఆరోగ్యసేవలు, అర్హులైన దంపతుల సర్వే, గర్భనిర్ధారణ పరీక్ష, గర్భిణీ నమోదు, ఆరోగ్యసేవలు తదితర విషయాలను ఈ-ఆశా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. హెచ్‌ఈఈఓ శ్రీనివాసులు, రిసోర్స్‌పర్సన్ జగదాంబిక, లక్ష్మీదేవి, నారాయణమ్మ, కాంతమ్మ, రాణి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

కర్నూలు(హాస్పిటల్): డేనియల్ రాజు ఫౌండేషన్ వారి డేనియల్ రాజు బ్లడ్ వరల్డ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బాలాజీనగర్‌లోని అపూర్వ రెసిడెన్సిలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుమన్ తండ్రి డేనియల్ రాజు వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ శిబిరంలో 70 మంది యువకులు రక్త దానం చేశారు. కర్నూలుతో పాటు నంద్యాల, తాడిపత్రిలలోనూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు సుమన్ తెలిపారు. తన తండ్రి పేరు తో స్థాపించిన ఈ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు విస్తృతం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సుమన్ తల్లి జ్యోతి, భార్య మానస పాల్గొన్నారు.

28న ఢిల్లీలో నిరసన

కర్నూలు కల్చరల్: రాయలసీమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో జూలై 28వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరసన చేడుతున్నట్లు స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఛలో ఢిల్లీ సన్నాహాక సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇతర ప్రాంతాలతో సమానంగా రాయలసీమను అభివృద్ధి చేయాలని, ఇందుకు అవసరమైన నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు సీమ కృష్ణ, శ్రీధర్, నవీన్, భరత్, లక్ష్మీకాంతయ్య, అయ్యన్న యాదవ్, వీవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 28వ వార్డు పందిపాడులో కార్పొరేటర్ నారాయణ రెడ్డి, కల్లూరు సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ లబ్ధిదారులకు బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు రాని వారిని శనివారం నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గుర్తించి పథకాలు అందిస్తామన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించాలన్నారు. కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కల్లా వెంకట రమణారెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, భీమేష్‌రెడ్డి, శ్రీనివాసులు యాదవ్, సత్యం రెడ్డి, రామకృష్ణ, హనుమంతురెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో విప్లవాత్మక మార్పులు



డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ బాబ్జి, రిజిస్ట్రార్ రాధికారెడ్డిలతో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ విప్లవాత్మక చర్యలు తీసుకోవడంతో వైద్యులకు మరింత దగ్గరవుతోందని మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్స్ కమిటీ మెంబర్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం విజయవాడలోని మెడికల్ కౌన్సిల్ హాలులో ఏపీ మెడికల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యులకు సంబంధించి పలు విషయాలపై చర్చించారు. గతంలో కొత్త వైద్యులు పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే అదో పెద్ద ప్రహసనంగా ఉండేదని, ఇప్పుడు చాలా సులువుగా మారిందని చెప్పారు. పాస్‌పోర్ట్ తీసుకున్నంత సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, దీనివల్ల అవకతవకలకు తావు ఉండదన్నారు. అలాగే రెన్యువల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వన్‌స్టాప్ పద్ధతిని త్వరలో అమలు చేయబోతున్నట్లు తెలిపారు. అలాగే 30 క్రెడిట్ పాయింట్ల సర్టిఫికెట్లు కూడా ఆన్‌లైన్‌లో ఫిజికల్‌గా నమోదు చేసి ఫీజు చెల్లించడం వల్ల అది మనకు ఇంటికే వస్తుందని తెలిపారు. ఈ విధానం ఒక నెలలోనే మొదలవుతుందని చెప్పారు. వైద్యులు నిరంతర విద్యార్థులేనని, సీనియర్ అయిన వైద్యులు కూడా సీఎంఈలలో పాల్గొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

ఇంటర్ పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

కర్నూలు సిటీ: ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాలని కోరుతూ పీడీఎస్‌యూ నాయకులు శుక్రవారం ఇంటర్‌మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడంతో ప్రభుత్వ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఆర్థికంగా ఇబ్బందిగా మారిందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాజు, విజయ్. అభి, ప్రతాప్, అఖిల్, వినోద్ పాల్గొన్నారు.

కామాంధుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

కర్నూలు (రూరల్) : కోసిగి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మహిళా టీచర్‌పై అత్యాచారయత్నానికి పాల్పడిన దిల్వర్ వలిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. స్కూల్ సమీపంలోని ఇంటి దగ్గరకు మూత్ర విసర్జనకు వెళ్లగా ఈ దుర్ఘటన జరిగిందన్నారు.

ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(రూరల్) : నగరంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని కేకే భవన్‌లో నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి ఉదయ్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూళ్లు చేస్తూ పుస్తకాలను వేల రూపాయలకు విక్రయించి విద్యార్థుల తల్లిదండ్రులను పీడిస్తున్న విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షుడు నరసింహ, సహాయ కార్యదర్శులు అబ్బు, భాస్కర్, తేజ, వీరేష్, హర్ష, యోగి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన

కర్నూలు సిటీ: సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో 9వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వేణుగోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌ను ప్రారంభించిందని, ఇందుకు ప్రత్యేకంగా 1930 అనే టోల్ ఫ్రీ నంబరు సైతం ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సుభాష్ సురేష్ కాలే, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ మహిళా విభాగం జిల్లా చైర్మన్‌గా వెంకట సుజాత

కర్నూలు(రూరల్): జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మహిళా విభాగం జిల్లా చైర్మన్‌గా ఎ.వెంకట సుజాతను నియమించినట్లు జిల్లా డీసీసీ అధ్యక్షుడు సుధాకర్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, రాష్ట్ర సేవాదళ్ చైర్మన్ ఎలమందా రెడ్డి ఆదేశాల మేరకు ఆమెను ఎంపిక చేశామన్నారు.

సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని సెక్యూరిటీ గార్డ్స్ సీఎస్ఓ ఉమాపతి నాయుడుకు ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. సెక్యూరిటీ గార్డులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని దీంతో వారి పిల్లలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న చిన్న కారణాలతో సెక్యూరిటీ గార్డులను విధులకు రావద్దని చెబుతున్నారని ఇలాంటి వేధింపులు ఆపాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మునెప్ప, నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్, సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, ప్రణీత్ తదితరులు ఉన్నారు.

2న గురుపూజోత్సవం

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో జూలై 2వ తేదీ ఉదయం 8 గంటలకు నంద్యాల రోడ్‌లోని దేవి ఫంక్షన్ హాల్‌లో గురుపూజోత్సవం నిర్వహిస్తున్నట్లు నగర సంఘ చాలక్ డాక్టర్ చల్లా వాసురెడ్డి తెలిపారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిణి సభ్యులు తులసీ సూర్య ప్రకాష్ ముఖ్య వక్తగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

సర్దుబాటు చార్జీలు తగ్గించాలి

కర్నూలు(రాజ్‌విహార్): సర్దుబాటు పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు డి. గౌస్ దేశాయ్, గిడ్డయ్య డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ సంస్థలు పెంచిన సర్దుబాటు చార్జీల వల్ల ప్రజలపై తీవ్ర భారం పడుతోందని పేర్కొన్నారు. ఇందన సర్దుబాటు చార్జీల పేరుతో 2014-15 నుంచి 2018-19 మధ్య యూనిట్‌కు 18 పైసలు పెంచారని, పేదలపై భారం పడే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు నరసింహ, సీపీఎం న్యూ సిటీ కార్యదర్శి రాముడు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ శాఖ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతికి వినతిపత్రం అందజేశారు.

25 వాహనాలు సీజ్

కర్నూలు : రోడ్డు ప్రమాదాల నివారణకు కర్నూలు నగరంలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాజ్‌విహార్, సి.క్యాంప్ సెంటర్, పాత ఈద్గా, ఫైవ్ రోడ్ జంక్షన్లలో శుక్రవారం లైసెన్స్ లేకుండా మైనర్లు నడుపుతున్న 25 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. వారిపై ట్రాఫిక్ నిబంధన ఉల్లంఘన కేసులు నమోదు చేసి రూ.50,875 జరిమానా విధించారు. ద్విచక్ర వాహనాలను కొత్తపేటలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన మైనర్లు, వారి తల్లిదండ్రులకు డీఎస్పీ నాగభూషణం కౌన్సెలింగ్ నిర్వహించారు.